క్లుప్తంగా

సబ్ డివిజన్ డ్రైవ్‌ను సద్వినియోగించుకోండి

కర్నూలు(సెంట్రల్): జాయింట్ సబ్ డివిజన్‌తో ఇబ్బంది పడుతున్న రైతుల కోసం జూన్ 30వ తేదీ వరకు సబ్ డివిజన్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జేసీ డాక్టర్ బి.నవ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం సచివాలయాల్లో రూ.50 చెల్లిస్తే సబ్ జాయింట్ సబ్ డివిజన్లను సబ్ డివిజన్ చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

12, 13 తేదీల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు

కర్నూలు కల్చరల్: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర 18వ మహాసభలను జులై 12, 13 తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లా కేంద్రం బాలాజీ నగర్‌లోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు జి.సురేష్‌కుమార్ తెలిపారు. మహాసభలకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, పాండిచ్చేరి, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జేవీవీ వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, జాతీయ ఉపాధ్యక్షుడు బి.విశ్వనాథ, జేవీవీ ప్రముఖులు సభల్లో పాల్గొని సందేశమిస్తారని తెలిపారు.

సీటీ స్కాన్ మిషన్ విరాళం



సీటీ స్కాన్ మిషన్ వద్ద సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అధికారులు

కర్నూలు(హాస్పిటల్): పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ వారు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు సీమెన్స్ కంపెనీకి చెందిన సీటీ స్కాన్ మిషన్‌ను విరాళంగా అందజేశారు. డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన దీనిని శుక్రవారం ట్రైల్ రన్ నిర్వహించారు. త్వరలో ఈ సీటీ స్కాన్ మిషన్‌ను ప్రారంభిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. రేడియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాధారాణి మాట్లాడారు. పవర్‌గ్రిడ్ కంపెనీ డీజీఎం నాగరాజు, సీమెన్స్ కంపెనీ ప్రాజెక్ట్ మేనేజర్ రవివర్మ, సేల్స్ మేనేజర్ దీప్తి, హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్ కేర్ లిమిటెడ్ డిప్యూటీ బయోమెడికల్ మేనేజర్ మీనా పాల్గొన్నారు.

క్రీడల సాధనను ప్రోత్సహించాలి

కర్నూలు(టౌన్): క్రీడల సాధనను ప్రోత్సహించాలని వీఆర్ మల్టీ హాస్పిటల్ అధినేత సి.వాసు రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తైక్వాండో ఒలింపిక్ క్రీడ అని చక్కగా సాధన చేసి ఉన్నత స్థితికి చేరుకొవాలన్నారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ శమంతకమణి, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధికి చేయూత

షూటింగ్ బాల్ క్రీడాభివృద్ధికి చేయూత నిద్దామని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జి.సురేంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక విఠల్‌నగర్‌లోని గుడ్ షెపర్డ్ స్కూల్ క్రీడా మైదానంలో అంతర్ పాఠశాలల షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించారు. షూటింగ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి పరుశరాముడు, తదితరులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం బోల్తా

కర్నూలు (అగ్రికల్చర్): హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిపై కర్నూలు సంతోష్ నగర్ వద్ద బొలెరో వాహనం బోల్తా పడింది. శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. బంతిపూలతో అనంతపురం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా వాహనం టైర్ పేలినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

అధికారమదంతో కారుకూతలు

- రెచ్చగొట్టే విధంగా టీడీపీ, జనసేన నేతల వ్యాఖ్యలు
- మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటనలో అడుగడుగునా ఆటంకాలు సృష్టించేందుకు కుట్ర
- జగనన్నకు కేంద్ర బలగాల రక్షణ కల్పించాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు 'మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని భూస్థాపితం చేస్తాం' అని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఏడు సార్లు తెలుగుదేశం ఎమ్మెల్యేగా గెలిచిన బుచ్చయ్య చౌదరి 'జగనన్న తల నరుకుతామంటూ' మాట్లాడారు. అధికార మదంతో మాట్లాడిన ఆయనపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ.. వైఎస్ జగన్ పర్యటనలో ఓ కార్యకర్త సినిమాలోని డైలాగుతో పోస్టర్‌ను ప్రదర్శించాడని, అదే అంశాన్ని జగనన్న చెప్పాడన్నారు. దీన్ని వక్రీకరించి ఒక పథకం ప్రకారం ఆయనపై కుట్ర చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీకి చెందిన కార్యకర్త తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి గురించి మాట్లాడుతూ.. రెడ్ల తల నరుకుతామని బహిరంగంగా చెబుతుంటే డిప్యూటీ సీఎం హోదాలో ఖండించాల్సింది పోయి నవ్వడం సిగ్గుచేటని విమర్శించారు. తెలుగుదేశం, జనసేన నాయకులు సంస్కారహీనంగా మాట్లాడుతుంటే వాటిని ఖండించాల్సిన ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలు ఎగదోసే విధంగా కుట్రలు చేస్తున్నారన్నారు. జగనన్న పర్యటనలు చేస్తే వేలాదిగా ప్రజలు తరలి వస్తుండటంతో తెలుగుదేశం శ్రేణులకు కడుపు మంటతో అడుగడుగున ఇబ్బందులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దిగజారిపోయిందని, క్రిమినల్ పాలిటిక్స్, డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి 'మాజీ సీఎంను భూస్థాపితం చేస్తాం, సాక్షిని లేకుండా చేస్తామని మాట్లాడుతున్నాడంటే' రాష్ట్రంలో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు.

జగనన్న భద్రతపై నమ్మకం లేదు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అధికార పార్టీ నాయకులు కుట్రలు చేస్తున్నారు. ఆయనకు భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదని ఎస్వీ అన్నారు. ప్రజల వద్దకు వెళుతున్న సమయంలో జెడ్‌ప్లస్ క్యాటగిరీలో ఉన్న జగనన్నకు కనీసం 10 మంది పోలీసులను నియమించడం లేదంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. పార్టీ శ్రేణులు, వైఎస్సార్‌సీపీ సైన్యం జగనన్నకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి జగనన్నకు కేంద్ర బలగాల రక్షణ కల్పించాలని కోరారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం



కలెక్టరేట్ ఎదుట సంతకాల సేకరణ చేపడుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యమైందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు దుయ్యబట్టారు. శుక్రవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ముఖ్యమంత్రికి అర్జీలు పంపే కార్యక్రమాన్ని కలెక్టరేట్ ఎదుట చేపట్టారు. ఇందులో భాగంగా నిరుద్యోగుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. వారు మాట్లాడుతూ.. జూన్ 15 నుంచి జులై 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి, నిరుద్యోగ భృతి కోసం పోరాటానికి దిగుతున్నట్లు చెప్పారు. తాము అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని, లేకపోతే నెలకు రూ.3 వేల భృతి ఇస్తానని చెప్పి సీఎం చంద్రబాబు నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఆయన అధికారంలోకి వచ్చాక ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకపోగా 2.60 లక్షల మంది వలంటీర్లు, 90 వేల మంది ఎండీయూ ఆపరేటర్లను రోడ్డుపాలు చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరుతూ సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అర్జీలు పంపిస్తున్నట్లు చెప్పారు. నాయకులు నాగరాజు, బీసన్న, చంటి, కాశీం, అఖిల్, శివ, రాజేష్, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

10 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల రాష్ట్ర కేబినెట్ 8 గంటల పని స్థానంలో 10 గంటల పని విధానాన్ని ప్రవేశపెడుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కేంద్ర కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు మాట్లాడుతూ.. కార్పొరేట్ ఒత్తిడితో కార్మికుల కడుపులు కొట్టేందుకు 10-12 గంటల విధానాలను రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్నాయని విమర్శించారు. ఏపీలో 10 గంటల విధానాన్ని తీసుకురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ విధానంతో మహిళా కార్మికులు, ఉద్యోగులు రాత్రిళ్లు కూడా పనిచేయాల్సి ఉంటుందన్నారు. మరోవైపు కేంద్రం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటికే కార్మికులు పని ఒత్తిడితో అల్లాడుతున్నారని, మహిళలకు పనిప్రదేశాల్లో రక్షణ లేదని, ఇలాంటి సమయంలో 10 గంటల పని విధానం సరికాదన్నారు. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, జి.చంద్రశేఖర్, టి.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ముజఫర్‌నగర్ శాఖ మహాసభలు



ర్యాలీలో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని ముజఫర్ నగర్ సీపీఐ మహాసభలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీరామచంద్ర (శివ రామాలయం) నగర్ సర్కిల్‌లో సీనియర్ నాయకులు గిడ్డయ్యఆచారి జెండాను ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. అక్కడినుంచి గుత్తి పెట్రోల్ బంక్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు ర్యాలీగా వెళ్లి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సమావేశానికి నగర సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఏపీ రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి కె.జగన్నాథం హాజరై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ముఖ్యంగా ముజఫర్ నగర్, షరీన్‌నగర్‌లో కనీస వసతులు లేకున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ముజఫర్ నగర శాఖ నూతన కార్యదర్శిగా రబీయా, సహాయ కార్యదర్శులుగా మల్లికార్జున, జానకమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి చింతల మహేష్, నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉద్యోగులకు గుర్తింపు



డీఈఈ హెచ్‌డీ ఈరన్నను సన్మానిస్తున్న పీఆర్‌ఎస్‌ఈ, ఇంజినీర్లు

కర్నూలు (అర్బన్): ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో క్రమశిక్షణతో వ్యవహరిస్తేనే మంచి గుర్తింపు లభిస్తుందని పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ వి.రామచంద్రారెడ్డి అన్నారు. ఇటీవల ఉద్యోగుల బదిలీల్లో భాగంగా పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ డీఈఈగా విధులు నిర్వహిస్తూ నందికొట్కూరుకు బదిలీ అయిన హెచ్‌డీ ఈరన్నను శుక్రవారం సాయంత్రం ఇంజినీర్లు ఘనంగా సన్మానించారు. స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో కర్నూలు ఈఈ మద్దన్న, పంచాయతీరాజ్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, క్వాలిటీ కంట్రోల్ డీఈఈ ఆర్.రవీంద్రారెడ్డి, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన డీఈఈలు నాగిరెడ్డి, ధనిబాబు, మల్లికార్జున, ఏఈలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న శమంతకమణి

కర్నూలు (టౌన్): విద్యార్థి దశలో మానసిక ఉల్లాసానికి క్రీడలు అవసరమని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ప్రాంగణంలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒలింపిక్ సంఘం గుర్తించిన క్రీడల్లోనే చిన్నారులు అభ్యసన, సాధన చేయాలన్నారు. తమ వంతుగా ఈ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఊట్ల రమేష్‌బాబు, తైక్వాండో కార్యదర్శి సతీష్ కుమార్, ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్, మాస్టర్లు వీరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

కర్నూలు(సెంట్రల్): కార్మిక వ్యతిరేక విధానాలపై ఆటో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ న్యూసిటీ నగర మూడో మహాసభ అధ్యక్షుడు హుస్సేన్‌వలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన పీఎస్ రాధాకృష్ణ, న్యూసిటీ అధ్య క్షుడు ఆర్.నరసింహులు మాట్లాడుతూ..సీఐటీయూలో ఆటో డ్రైవర్లు భాగస్వామ్యమై హక్కుల కోసం గళం విప్పాలని పిలుపునిచ్చారు. జీవనోపాధి కోసం ఆటో నడుపుతున్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ చలాన్ల రూపంలో దోపిడీ చేస్తున్నాయని, పైగా సంక్షేమ పథకాలు వర్తింపకుండా చేస్తున్నారని విమర్శించారు. ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్లను రద్దు చేయాలని కోరారు. రద్దు చేసిన 44 లేబర్ చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాల ని కోరారు. ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, న్యూసిటీ ప్రధాన కార్యదర్శి బి.రాధాకృష్ణ పాల్గొన్నారు. అంతకుముందు ఇటీవల మ రణించిన కార్మికులకు సభలో నివాళులర్పించారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆటో యూనియన్ న్యూసిటీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె.ప్రభాకర్, అధ్యక్షుడిగా ఎస్.హుస్సేన్‌వలి, ఉపాధ్యక్షులుగా ఎస్.మాలిక్‌బాషా, రాజశేఖర్, నాగరాజు, భాస్కర్, శీను, రాము, శీను, ప్రధాన కార్యదర్శిగా బి.రాధాకృష్ణ, సహాయ కార్యదర్శులుగా షంషీర్‌బాషా, మల్లి, పి.నబీ, సుబ్బన్న, రాజశేఖర్, మధు, కమిటీ సభ్యులుగా శంకర్, నాగరాజు, అయ్యన్న, మధు, శివకృష్ణ, పెద్ద కరుణ, మధు, జయన్న, మౌలాలి ఎన్నికయ్యారు.

అడ్రినల్ గ్రంధిలో కణితి

కర్నూలు(హాస్పిటల్): పది లక్షల మందిలో ఒకరికి వచ్చే అరుదైన సమస్య ఆమెకు వచ్చింది. అడ్రినల్ గ్రంధిలో ఏర్పడిన కణితిని కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ల్యాప్రొస్కోపీ ద్వారా తొలగించారు. వివరాలను శుక్రవారం యురాలజిస్ట్ డాక్టర్ మనోజ్‌కుమార్ మీడియాకు తెలిపారు. 'కర్నూలుకు చెందిన రూపారాణి (35)కి అడ్రినల్ గ్రంధిలో ప్రమాకరమైన కణితి ఏర్పడింది. దీనివల్ల ఆమె గర్భం దాల్చినప్పుడు రక్తపోటు, షుగర్ లెవెల్స్ అసాధారణంగా పెరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో గర్భం కొనసాగించడం ప్రాణాలకే ముప్పు కాబట్టి గర్భస్రావం చేయాల్సి వచ్చింది. రక్తపోటు పెరగడానికి కారణం తెలుసుకునే ప్రయత్నంలో ఆమెకు అడ్రినల్ గ్రంధిలో కణితి ఉన్నట్లు గుర్తించాం. మరిన్ని పరీక్షలు చేయగా అది ఫెయోక్రోమోసైటోమా అనే కణితిగా నిర్ధారణ అయ్యింది. దాని నుంచి హార్మోన్లు ప్రవించడం వల్ల రక్తపోటు గణనీయంగా పెరిగినట్లు తెలుసుకున్నాం. ఇటీవల ల్యాపరోస్కోపీ ద్వారా అడ్రినల్ గ్రంధిలో ఏర్పడిన కణితిని తొలగించాం. దీంతో ఆమెకు బీపీ, షుగర్ లెవెల్స్ సాధారణ స్థితికి వచ్చాయి' అని ఆయన వివరించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లపై విచారణ

కర్నూలు (అర్బన్): జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగంలో గతంలో జరిగిన పలు సంఘటనలకు సంబంధించి నలుగురిపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వ కార్యదర్శి శశిభూషణ్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్‌లో జరిగిన కారుణ్య నియామకాలకు సంబంధించి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్ కంటే పైక్యాడర్ నియామకాన్ని చేపట్టడం, పెన్షన్ తదితర సంఘటనలపై విచారణకు ఆదేశించారు. గతంలో ఇక్కడ ఎస్‌ఈగా విధులు నిర్వహించి ప్రస్తుతం పదవీ విరమణ చేసిన సీహెచ్ విద్యాసాగర్, గతంలో డీఈఈగా విధులు నిర్వహించిన ఒక డీఈఈ, సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్‌పై విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ హరేరామ్ నాయక్‌ను, అలాగే ప్రెజెంటింగ్ ఆఫీసర్‌గా అనంతపురం ఎస్‌ఈ ఆర్.సురేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

దోమలను నివారించాలి

కర్నూలు(హాస్పిటల్): దోమలు పెరగకుండా ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని డెమో శ్రీనివాసులు శెట్టి సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ధర్మపేట కాలనీలో నిర్వహించిన ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పించారు. మన అందరి మార్పుతో మలేరియా అంతం సాధ్యమవుతుందని చెప్పారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, వైద్య సిబ్బంది వెంకటేశ్వరమ్మ, సుజాత పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి



ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ నిపుణులు రమ్యను సన్మానిస్తున్న వీసీ, తదితరులు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న యోగాంధ్ర వర్క్‌షాప్ విజయవంతమైందని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు అన్నారు. గత నాలుగు రోజుల నుంచి వర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వర్సిటీ, నంద్యాల రాపర్తి రామా అకాడమీ ఆఫ్ యోగిక్ సైన్సెస్ సంయుక్త భాగస్వామ్యంతో నిర్వహించిన వర్క్‌షాప్‌కు మంచి స్పందన లభించిందన్నారు. నంద్యాలకు చెందిన ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మంచి ఆహారంతో క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం చేయాలన్నారు. ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ నిపుణులు జి.రమ్య, వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు మాట్లాడారు. ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): అంతర్జాతీయ యోగా దినోత్సవంలో వైద్యులు, సిబ్బంది భాగస్వాములు కావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. ఆమె శుక్రవారం ఆమె తన ఛాంబర్‌లో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వారి సమీపంలో నిర్వహించబోయే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. వైద్యాధికారులు మండల స్థాయిలో, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సబ్‌సెంటర్/గ్రామస్థాయిలో 21న ఉదయం 6.15 గంటలకు పాల్గొనాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల యాజమాన్యాలు సైతం వారికి సమీపంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

దైనందిన జీవితంలో యోగాభాగం కావాలి

కర్నూలు కల్చరల్: దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ అన్నారు. శుక్రవారం వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్సిటీ నుంచి శరీన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. వర్సిటీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబుబ్ బాషా, ఎన్‌ఎస్‌ఎస్ పోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ పాల్ కృపాకర్, పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హుస్సేని, వర్సిటీ ఉద్యోగులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్‌భవన్‌లో సన్నాహక యోగా

కర్నూలు(అగ్రికల్చర్): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్‌లో సన్నాహక యోగా కార్యక్రమం జరిగింది. ఎస్‌ఈ ఉమాపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగా గురువు పెరుమాళ్ల సత్తెయ్య యోగాసనాలు చేయించారు. ఈఈలు ఓబులేసు, మహేశ్వరరెడ్డి, బి.లత, శేషాద్రి, డీఈఈ బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు (టౌన్): ప్రతి రోజూ యోగాసనాలు వేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండొచ్చని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఖానా- ఖజానా వద్ద, అలాగే నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్‌లో మెప్మా ఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని 5 వేల మందితో యోగ డే నిర్వహించనున్నట్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డుపై ఏఎస్‌ఐ దాడి

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధి నిర్వహణ విషయంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హోంగార్డు బాషా మధ్య గురువారం రాత్రి వివాదం చోటు చేసుకుంది. పైఅధికారిగా ఉన్న తన మాటలను హోంగార్డు బాషా లెక్క చేయడం లేదని ఏఎస్‌ఐ దాడికి పాల్పడ్డాడు. ముఖం మీద కొట్టడంతో హోంగార్డు బాషా పళ్లు రాలినట్లు తెలుస్తోంది. ఘటనపై హోంగార్డు బాషా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లుపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

హెడ్ కానిస్టేబుల్ మృతి

కర్నూలు (అగ్రికల్చర్): నంద్యాల జిల్లా ఆత్మ కూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా ప నిచేస్తున్న శ్రీనివాసులు(50) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. ఈయన కర్నూ లులోని బిర్లాగడ్డ ప్రాంతంలో కుటుంబంతో నివసిస్తున్నారు. కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్నారు. ఇటీవల చికిత్స కోసం కర్నూలు సర్వజన వైద్యశాలలో చేరారు. అయితే కోలుకోలేక మరణించారు. ఈయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నా రు.హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల పోలీసు అధికారులు, పోలీసులు సంతాపం ప్రకటించారు.


వైద్య ఆరోగ్య శాఖలో ముగిసిన బదిలీలు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగిసింది. జిల్లా స్థాయిలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ, జోనల్ స్థాయిలో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రామగిడ్డయ్య ఆధ్వర్యంలో జూమ్ ద్వారా బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియ గందరగోళ పరిస్థితుల మధ్య కొనసాగింది. వాస్తవానికి గురువారం రాత్రికే కౌన్సెలింగ్ ముగియాల్సి ఉన్నా పలువురు ఉద్యోగులు అభ్యంతరాలు లేవనెత్తడంతో శుక్రవారానికి వాయిదా పడింది. దీంతో శుక్రవారం ఉదయం నుంచి స్టాఫ్‌నర్సులు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ కొనసాగింది. ఐదేళ్లపైబడి ఒకేచోట విధులు నిర్వహించిన వారందరికీ బదిలీ తప్పలేదు. కొందరు ఆఫీస్ బేరర్లుగా, మరికొందరు మెడికల్ గ్రౌండ్స్‌లను ఉపయోగించుకుని స్థానికంగానే ఇతర విభాగాల్లో బదిలీ అయ్యారు.

ఆలూరు, ఆస్పరి ఓబీసీ సెల్ చైర్మన్ల నియామకం

కర్నూలు(సెంట్రల్): ఆలూరు నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి మండలాల ఓబీసీ సెల్ చైర్మన్లుగా హజరత్‌వలి, ఖాదర్‌ను నియమించారు. ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ సొంటి నాగరాజు సూచనల మేరకు ఈ నియమకాలు చేపట్టినట్లు జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డీవీ సాంబశివుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారికి మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు, మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు నియాకపత్రాలను అందజేశారు.


ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



నిరాశ్రయుల ఆశ్రమంలో చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ కర్నూలు మాడ్యుల్ ఆధ్వర్యంలో దివంగత నేత వై.తాకరనాథ్ 21వ వర్ధంతిని పురస్కరించుకొని వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రైల్వే స్టేషన్ సమీపంలోని నిరాశ్రయుల ఆశ్రమంలో చీరలు, దుప్పట్లు, నిత్యావసర సరుకులు, మద్దూరునగర్‌లోని అమ్మవృద్ధుల ఆశ్రమం, అమ్మ అంధుల పాఠశాలల్లో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.హేమ, కర్నూలు రీజినల్ మేనేజర్ తేజోమూర్తుల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో ప్రతిభ చాటాలి



అథ్లెటిక్స్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): అథ్లెటిక్స్ క్రీడాంశంలో ప్రతిభ చాటాలని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు క్రీడాకారులకు సూచించారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఒలింపిక్ డేను పురస్కరించుకొని ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, బాస్కెట్‌బాల్, తైక్వాండో, సిలంబం, షూటింగ్ బాల్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల ప్రారంభ కార్యక్రమంలో న్యాయవాది శ్రీధర్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి, జాఫర్ మున్నా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22న కర్నూలులో నిర్వహించనున్న ఒలింపిక్ రన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షవర్ధన్, చిన్న సుంకన్న, దాసరి సుధీర్ పాల్గొన్నారు.